# పునర్జన్మ

శ్రీ చండీ సహస్రనామార్చన ముగించి వాళ్ళకి ప్రసాదం ఇవ్వడానికి అటు తిరిగిన నరసింహం, వాసుదేవరావునీ, లలితనీ, ఓ పదినిముషాల సేపు చూసి, తీర్థం, ప్రసాదం, పువ్వులూ కుంకుమా మౌనంగా ఇచ్చేసి కొంతసేపు ఉండమన్నట్లు సైగ చేశాడు. వాళ్ళు గుడి బయట చెట్లకింద నిలుచున్నారు. నరసింహం గర్భ గుడిలోకి వెళ్ళి అమ్మవారి విగ్రహం ముందు రెండు నిమిషాలు కళ్ళుమూసుకు కూర్చుని, సాష్టాంగనమస్కారంచేసి అరమోడ్పుకన్నులతో వాళ్ళ దగ్గరకు వచ్చాడు. అతని వయస్సు డెబ్బయిపైనే అయినా ఒక అడవినిఏలే పెద్దపులి నడకతో ఠీవిగా సాత్త్వికంగా వున్నాడు.

"నీ పేరేంటి బాబు?"

"వాసుదేవరావు-ండి."

"అమ్మడు పేరు?"

"లలిత"

"లలిత. నా తల్లిపేరే! ఎన్నేళ్ళమ్మా నీకు? ఈ కాలపు ఆడపిల్లల్ని వయస్సెంతో అడక్కూడదంటారనుకో."

"పాతిక" వాసుదేవరావే చెప్పాడు.

నరసింహం లలితని ఓ అరనిమిషం పరిశీలించి కంటతడి పెట్టాడు. ఏమీ మాట్లాడలేదు. వాళ్ళకి అతని ప్రవర్తన అయోమయంగా, ఇబ్బందిగా వుంది. ఏం చెయ్యాలో తోచక లలిత నెమ్మదిగా అక్కడున్న పువ్వులచెట్లవైపు వెళ్ళి పువ్వులు కోయసాగింది.

"ప్రతీ మొగాడూ తల్లుల్ని జాగ్రత్తగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఎక్కడ స్త్రీలు గౌరవించబడ తారో అక్కడ దేవతలు ఉంటారు. అదినాయనా, హిందూధర్మం ప్రత్యేకత. నీ భార్య పాతి కేళ్ళది. మొహంలో, మాటలో, చూపులో ... అప్పుడే ఎంత అలసట కనిపిస్తోంది!" అతని గొంతు బొంగురుపోయి ఓ క్షణం మాట రాలేదు. తర్వాత సి.హెచ్. ఆత్మా గొంతుతో "దుర్మా ర్గుడా, ఇదేనా పెళ్ళాన్ని ప్రేమించడం?- చిట్టితల్లికి అసలు విశ్రాంతి లేకుండా జాగ్రత్త పడి వుంటావు! చదువుకున్నట్టుంది; నీ నైక్‌లై, బూట్లూ వగైరా చూస్తుంటే. నీ మొహంచూస్తే కాదనుకో!" అని దులిపేశాడు.

వాసుకి ఓక్షణం వెట్టికోపం వచ్చి అతని పీకనులిమేయాలనిపించింది. మరుక్షణం కరిగిపోయాడు. అతను చెప్పింది నిజం. తన భార్యమీద ఈ శ్రద్ధ ఎవరు కనబర్చారు. ఆమె ఆరోగ్యం గురించి ఆఖరికి తన అత్తగారుకూడా ఇలా బాధపడ్డం చూడలేదు. తల వంచుకున్నాడు.

నరసింహం కొంత తమాయించుకుని, "బాబూ నేను చెప్పేది సరిగా అర్థంచేసుకో, మన దేవాలయాల్లో రకరకాల విగ్రహాలున్నవి. పురుషదైవాలు, అమ్మవార్లు, గణపతి, కుమారస్వామి, బాలకృష్ణుడులాంటి చిన్నపిల్లలు, ఆఖరికి పాము, పంది, తాబేలు ... ఇన్నిరకాల్ని చూసి హృదయంలేని మూర్ఖులు నవ్వుతారు. కాని సృష్టిలోఉన్న జీవకోటి అంతనీ ఆరాధించమనీ, అంటే ప్రేమించమనీ చెప్పడానికి గుర్తుచేయడానికే మనకి ఇన్నిరకాల దేవుళ్ళొచ్చారు. సరేకాని అమ్మడు ఆరోగ్యం గురించి నువ్వు-"

"రెండు టానిక్ లూ, మూడుమందులూ వాడుతున్నామండీ. రెండేళ్ళనుంచీ మందులకే అవుతోంది, నెలకి రెండేసి వందలు-"

"విశ్రాంతికిమించిన టానిక్ లేదునాన్నా! చిట్టితల్లికి విశ్రాంతి కావాలి"

చేతులు పట్టనన్ని పువ్వులు కోసేసి ఎలా పట్టుకెళ్దామా అని ఇబ్బందిపడుతున్న లలితని చూసి వాసు "వెళ్ళొస్తానండి, తమర్ని రేపు కలుస్తాను." అని సెలవు తీసుకున్నాడు.

* * *

భార్యతో కొండదిగుతూ ఆలోచనలో పడిపోయాడువాసు. తను పెళ్ళాన్ని అంత కష్ట పెడుతున్నాడా?

టెక్స్టయిల్ ఇంజనీరు వాసు. అనేక అందమైన అమ్మాయిల్ని ఇంటర్వ్యూ చేసి చివ రికి లలితని భార్య గావించుకున్నాడు. లలిత చాలా మామూలు పిల్ల. ఎస్సెల్సీ మాత్రమే చదివింది, ఒంటిరంగూ సామాన్యమే. కళ్ళు, ముక్కు, చేతులు ఏ అవయవంలోనూ ప్రత్యేకం చెప్పుకోడానికి ఏమీలేదు. (అదే వాసు అక్క రమణి ఎత్తిపొడిచేది, బతికున్నన్నాళ్ళూ.) కాని వాసు పెళ్ళిచూపుల సమయంలో తలవంచుకోకుండా తామున్న గదిలోకి వస్తున్న లలితని చూస్తూనే "బాపు గీసిన బొమ్మ" అనుకున్నాడు. ఆ క్షణంలోనే వాళ్ళ పెళ్ళి జరిగిపోయింది అతని లెఖ్ఖప్రకారం. బాపు బొమ్మలు ఏ గీతకాగీత చూస్తే అయిదారేళ్ళ పాపలు మొద్దుముక్కు పెన్సిలుతో నిర్లక్ష్యంగా గీసిన కొన్ని గీతల్లా ఉంటాయి. కాని మొత్తం బొమ్మని చూస్తే గుండె ఝల్లుమంటుంది. అదే శృంగారం, అదే వేదాంతం, అదే హాస్యం! లలిత అలా నిలబడింది, అతని కళ్ళముందు. వికసించిన కళ్ళతో ఓసారి అతన్ని ఆపాదమస్తకం చూసి తలవంచుకుంది.

పెళ్ళయ్యాక కొన్ని నెలలు కలల్లా, తీయని కవితల్లా, పక్షులపాటల్లా- తేలిపోయాయి వాళ్ళకి. లలిత మొదటి ముద్దు పేరు (బాపుబొమ్మ) వాసుకి చాలలేదు. తనివితీరక రోజుకో సినిమాస్టార్ పేరుతో పిలిచేవాడు. ఇంకా చాలక చిట్టి పొట్టి, పప్పుగిన్ని, గిన్నికోడి, పాలపిట్ట .... అలా పిలుస్తూండేవాడు. ఏపేరుతో పిలిచినా అంగీకరించేది లలిత. ఎంతమందిచుట్టూ ఉన్నా ఏవో పేర్లు పెట్టి పిలుస్తున్నాడని తప్పుపట్టడం అనే ప్రశ్నే లేదు.

తరువాత ఇద్దరు ముత్యాల్లాంటి బిడ్డలు ఏడాది ఎడంతో పుట్టారు వాళ్ళకి. వాసు

అక్కగారు స్టౌమంట అంటుకుని ఒళ్ళు కాలి చచ్చిపోయింది. వాసు బావ శరభయ్య, మేనల్లుడు వేణు వీళ్ళ ఇంటికి వచ్చేశారు.

వాసు ఉదయం ఏడింటికి ఫ్యాక్టరీకి బయలుదేరతాడు, అతని టిఫిన్, కాఫీ ఆరింటికి మొదలెట్టేది లలిత. వేణు స్కూలుకి తొమ్మిదింటికి భోంచేసి వెళతాడు. వాసు వెళ్ళగానే వంట మొదలెట్టాలి. ఆ తరువాత శరభయ్యకి స్పెషల్ వంట (అంతా చప్పిడి.) తరువాత తన రెండోసారి స్నానం, భోజనం. ఇంటర్వెల్‌లో వచ్చిన వేణుకి టిఫిన్, సాయంత్రం వచ్చిన వాసుకి టిఫిన్, కాఫీ. సాయంత్రం మళ్ళీ వంటలు. శరభయ్య దేవి ఉపాసకుడు. రాత్రి పూజా జపం పూర్తయాక పదకొండు గంటలకి భోజనం. రోజంతా చంటిపిల్లల స్నానాలు, పక్కబట్టలు శుభ్రపర్చడం, పాలుపట్టడం, పడుకోబెట్టడం. అర్థరాత్రికి నిద్రపోదామంటే వాసు పడుకోనీయడు. తెల్లవారకుండానే కుళాయినీళ్ళు పట్టడం, పాలు పోయించుకోవడం వగైరా.

ఇదంతా కొద్ది నిమిషాల్లో వాసు మనస్సులో కలలా గబగబా గుర్తొచ్చింది. ఈమధ్యే తనకి జీవితంలో శృంగారం ఉల్లాసం అనేవి లేవనీ, అవి కవుల ఊహాకల్పనలనీ, జీవితం దుఃఖమయం అనీ అనిపించసాగింది.

"లల్లీ"

"ఊఁ"

"నీకు అలసటగా ఉంటోందా?"

"లేదే" ఖచ్చితంగా చెప్పింది లలిత.

కొండ పాదాలదగ్గిరేవుంది వాళ్ళు దిగిన హొటల్. నేరుగా డైనింగ్ రూంకెళ్ళి భోంచేసి వాళ్ళగదికి వెళ్ళారు. బట్టలు విప్పేసుకుని పడుకుని లలితని కావలించుకున్నాడు వాసు. ఒళ్ళంతా నిమురుతూ, నలిపేస్తూ "రేపట్నుంచి ఎలాగో భయమేస్తోంది" అన్నాడు.

"మీవాళ్ళంతా ఉంటారుగా హాస్టల్‌లో"

"తెలీనట్లు! దొంగమాటలు. నువ్వు పక్కన లేకుండా-"

"నేను కూడా ఉండిపోనా" నవ్వింది.

"కుదరదే"

వాసునీ, ఇతర ఇంజనీర్లనీ ఆధునికులుగా చేయడానికి వాళ్ళ మేనేజింగ్ డైరెక్టర్ ఓ రిఫ్రెషర్ కోర్సు ఎరేంజ్ చేశాడు. శ్రీ చండీనగరంలో ఓ ఇంజనీరింగు కాలేజీ వుంది. అందులోని అధ్యాపకులు; బొంబాయి, కలకత్తా, అహమ్మదాబాద్‌లనుంచి కొందరు మేనేజ్‌మెంటు నిపుణులూ; వచ్చి లెక్చర్లు ఇస్తారు. ఇంజనీరింగ్‌లోనూ, మేనేజ్‌మెంటులోనూ కొత్తగా వచ్చిన ప్రగతిని వీళ్ళకి పరిచయంచేస్తారు, మొత్తం మూడు వారాల కోర్సు. శ్రీ చండీనగరం ఇంజనీరింగుకాలేజీ ప్రస్తుతం స్ట్రైక్‌లో ఉంది. హాస్టల్స్ ఖాళీగా ఉన్నాయి. అక్కడ వీళ్ళకి బస.

అన్నాళ్ళూ లలితనీ, పిల్లల్నీ, శరభయ్యనీ "జాగ్రత్తగా చూసుకోడానికి" లలిత తల్లి వచ్చింది. వాళ్ళకి బెంగలేదు. యెటొచ్చీ వాసుకే. లలిత దూరమై 'ఒక్కడూ' మూడు వారాలు గడపాలి.

* * *

సూర్యుడు అస్తమించాకా ముడుచుకుపోయిన కమలంలా వుంది లలిత. నిద్రపట్టక గొలుసుకట్టుగా సిగరెట్లు కాలుస్తూ ఆమె అర్ధనగ్న దేహాన్ని చూస్తున్న వాసుకు నరసింహం మాటలు గుర్తొచ్చాయి "అలిసిపోతే మనుషులు చిక్కిపోరూ? లలిత ఏం చిక్కినట్లు లేదే" అనుకున్నాడు.

అలాగే తెల్లవారింది. ఎనిమిదిగంటలకి లలితని బస్ యెక్కించి తను ఇంజనీరింగు హాస్టల్ కి పోవాలి అనుకోగానే చలేసింది వాసుకి. వెంటనే డైనింగ్ రూంకి వెళ్ళి "బెడ్ కాఫీ" తాగి సిగరెట్లు కొనడానికి వీధి వేపు వచ్చాడు.

నరసింహం! పరుగెత్తుకెళ్ళి ఆయన్ని ఆపాడు. "నమస్కారమండీ".

"నువ్వాబాబూ, అప్పుడే లేచిపోయావు?"

"మీతో మాట్లాడాలి" సిగ్గువిడిచి తన దైన్యాన్ని బయటపెట్టాడు.

"పద, మీ హొటల్లో కాఫీ ఇప్పిస్తే వస్తాను."

ఇద్దరూ కూర్చున్నారు. తన తక్షణసమస్యని వివరించాడు వాసు. తను భార్యని విడిచి మూడువారాలు ఉండాలి, బాబోయ్.

నరసింహం నవ్వాడు. "మంచిదేకదయ్యా. చంటిపిల్లలు తల్లుల్ని నిద్రసరిగా పోనివ్వరు. నీలాంటి ప్రేమభర్తలు అంతకంటే కనాకష్టం. వేరేవుండు, అమ్మడు సుఖంగా నిద్రపోతుంది ఈ ఇరవై రోజులూ. ఓ కే?"

"చంపేశారు. నాతరం కాదు."

నరసింహం కొన్నినిముషాలు ఆలోచించాడు. "మంచిడాక్టరు రోగి దురభ్యాసాన్ని ఒక్క సారి మానిపించడు. వాడు ఉన్నస్థితిలోనే వైద్యం మొదలుపెట్టి వాటిని తగ్గించుకునే శక్తిని ప్రసాదిస్తాడు; నీకు సడెన్ బ్రహ్మచర్యం అసలు పడదు. ప్రాణాలే పోవచ్చు."

"చిత్తం"

"ఓపనిచెయ్యి. అమ్మవారిగుడికి ఫర్లాంగుదూరంలో ఓ సత్రం ఉంది. దసరాలకి వచ్చి అక్కడే పూజలూ జపాలూ చేసేవాళ్ళకని కట్టించాం. ఒకగది మీకిస్తాను. తిండి మేమే పెడ తాము. ఊరికే కాదనుకో.

ఎగిరి గంతేశాడు వాసు. రిలీఫ్ లో పెద్దగా నవ్వుతూ "నేను మాత్రం పూజలూ జపాలూ చెయ్యను. తొమ్మిదినుంచి అయిదుదాకా మమ్మల్ని క్లాసులో తోముతారు. సిగరెట్ కాలుస్తారా? ...."

"ఏ బ్రాండ్, విల్స్ఫిల్టరా? దగ్గొస్తుంది. చార్మినార్ ఒకటి తెచ్చిపెట్టు."

* * *

నరసింహం ఇంట్లోభోంచేసి వచ్చి నిద్రపోడానికి ఉపక్రమిస్తూ "హాయిగా ఉంది. హల్ చా ..." అని ఆవలించింది లలిత. వెంటనే నిద్రపోయింది. ఇక్కడ పనీపాటూ లేదు కనుక మరింత సరదాగా గడపచ్చునని కలలుగన్న వాసు తెల్లబోయాడు. ఇంట్లో ఉన్నప్పుడు అంత చాకిరీచేసి కూడా పన్నెండుదాకా నిద్రపోయేదికాదు తన పెళ్ళాం. ఇప్పుడిదేం వికారం! అనుకుని

నిట్టూర్చి కాలేజీలో ఇచ్చిన హోంవర్కు చేయడం మొదలు పెట్టాడు.

పన్నెండయింది. తనకి నిద్ర రావటం లేదు. నెమ్మదిగా లలిత పక్కని పడుకుని దగ్గరకు లాక్కోబోయాడు. బలంగా తోసేసింది లలిత. ఎంతో కోపం వచ్చి అటుతిరిగి పడుకున్నాడు వాసు.

పదిరోజులయినా అదే వరస. నరసింహం భార్య పక్కన కూర్చుని తెగమే పేదివాళ్ళని. లలితకి భోజనం పూర్తికాకుండానే నిద్రవచ్చేస్తూంది.

పిల్లల హడావిడీ, ఇంటిచాకిరీ లేకుండా హాయిగా మరో 'హనీమూన్' ఎంజాయ్ చేద్దామనుకున్న వాసుకి లలిత చేష్టలు చాలా దిగులు కలిగించాయి. ఏమైనా రోగమేమో అని భయం కూడా వేసింది.

వెంటనే ఇంజనీరింగు కాలేజీ డాక్టర్ని బతిమాలి కొండమీదకి తీసుకొచ్చి భార్యని చూపించాడు. ఆయన చాలా సీరియస్‌గా 'ఏదైనా ఇన్‌ఫెక్షన్ కావచ్చు టెస్టులు చేయించాలి. బ్లడ్, యూరిన్ ... అయినా ఈ మందులు వాడిచూడండి.' అని ఫీజుకు తగ్గట్టు తూకంగా పేజీన్నర మందులు రాశాడు. రెండువందలైనా కావాలి. నరసింహంతో చర్చించాడు వాసు. వెంకటప్రమణ జోక్ విన్నట్లు అదేపనిగా నవ్వసాగాడు నరసింహం. 'ఏదీ ఆ ప్రిస్‌క్రిప్షన్, చూణ్నీ! పెద్ద డాక్టరు కదా, అంచేత పెద్దదే ఇచ్చాడు. దీన్ని మనం విసరలేం మామూలుగా. ఓ రాయికి దీన్ని చుట్టి విసరాలి. నువ్వు విసురుతావా, లేకపోతే పెద్దవాణ్ని కనుక నేనువిసరనా? ఇంతకీ మీ ఆవిడమీద అంత కక్షదేనికీ ఆ డాక్టరుకి? చిట్టితల్లి ఏం అపరాధం చేసిందని ఈ శిక్ష? హాయిగా యేడేళ్ళ కాపురంలోనూ భర్త కానుకగా అలసటని నిర్లక్ష్యంగా పోగొట్టుకుంటోందనా .... హాహాహా!" డాన్సుకూడా మొదలెట్టాడు.

'మీ వెధవ చదువులూ మీరూనూ. విశ్రాంతి తీసుకోలేని వాజమ్మలు.'

వాసుకి యేడుపొచ్చినట్లయింది "మీ కాళ్ళమీదపడతాను. నా పరిస్థితి మీకర్థంకాదు. పడుచువాళ్ళ బాధలు మీకుండవు. పదిరోజులు, నిండా పాతికేళ్ళులేని పెళ్ళాం అదేపనిగా నిద్రపోతూంటే యెలా ఉంటుందని ..." అన్నాడు.

నరసింహం 'అర్థమైందిలేవోయ్ విశ్రాంతి చాలక మీ ఆవిడ అలా రోజంతా నిద్రపోతోంది. నిద్రలో వచ్చే రెస్టు నిత్యం వేళకి నిద్రపోయేవాళ్ళకి కూడా చాలదు. ధ్యానం అని పేరెప్పుడైనా విన్నావా?'

"ధ్యానంలో విశ్రాంతేమిటండీ, బాబూ! ధ్యానానికి బోల్డు కాన్సెంట్రేషనుండాలి. ఇంకాస్త అలసట వస్తుంది." అన్నాడు వాసు.

"ఎవడు చెప్పేడు?"

"ఎవడేమిటీ? స్వామి ఉగ్రానందా, తీవ్రధ్యానానందా, కఠోర ఉపాసనా మహరాజ్ అందరూ అలాగే రాశారండి. వాళ్ళంతా...."

"వెర్రి వెధవలు. ఛీట్స్, రాక్షసులు. మోసం అంతా ..." గుక్క తిరగడానికి ఆగి అన్నాడు నరసింహం. "శ్రద్ధగావిను, మనం మనవ్యవహారాల్లో ప్రతిక్షణం మనస్సుని అదుపులో

పెడుతూనే ఉన్నాం. అదేదీ ధ్యానం కాదు. రాత్రి పడకగదిలో. శ్రమయెక్కువై పొద్దున్నే లేవబుద్ధికాదు. ఇంకా పడుకోవాలని వుంటుంది. అయినా లేస్తావు." మనస్సును కంట్రోలు చేయటంకాదు. అలాగే మీ బాస్ వచ్చీరాని ఇంజ నీరింగ్ జార్గన్‌తో నిన్ను బోరుకొడుతుంటే మొహంమీద గుద్దాలనిపిస్తుంది నీకు. అయినా ఊరుకుంటావు. అది మనస్సుని కంట్రోల్ చెయ్యడం కాదు. ఇలా రోజంతా మనస్సుని కంట్రోలు చేస్తూనే వున్నాం కాదా? ఈ రకంగా మనస్సుని కంట్రోలు చెయ్యడమే ధ్యానం అయితే ప్రతి వాడూ ఆపనే చేస్తున్నాడు. యీ సన్యాసివెధవలూ, సాములార్లూ దాన్నే ధ్యానం అనచ్చుగా?"

"కాదండి. దేవుడిమీదతప్ప ఇతరత్రా మనసుపోకుండా మనస్సుని కంట్రోలుచెయ్యాలి. అలా చేయగా చేయగా-"

'-పిచ్చెత్తుతుంది. మీబావలా తయారవుతావు" కసిగా అన్నాడు నరసింహం. వాసుకి తన అక్క మొగుడి చేతిలో పడ్డ బాధలు గుర్తొచ్చాయి. శరభయ్య తన మంత్రదీక్ష ఫలించక పోవడానికి కారణం సంసారమేనని పెళ్ళాన్ని కొడుతూ ఉండేవాడు. వీలయినప్పుడల్లా అవమానించేవాడు. ఆవిడ ఒళ్ళు కావాలనే కాల్చుకుందనీ ఏక్సిడెంటు కాదనీ పుకారుకూడా వచ్చింది. అవన్నీ గుర్తొచ్చి దిగులుగా ఆలోచనలలో మునిగిపోయిన వాసుకి నరసింహం మాటలు దూరాన్నించి వచ్చినట్లు వినబడ్డాయి. "మనస్సుని స్వేచ్ఛగా పోనీయడమే ధ్యానం. అదే దుఃఖంనించీ, శ్రమనించీ, అలసటనించీ మోక్షం!" అమ్మణ్ణి కూడా పిలు. నేర్పేస్తాను."

* * *

ఓ అయిదు నిముషాలు అయ్యాక కళ్ళు తెరిచింది లలిత. "ఛీఛీ. ఈ ధ్యానం నేను చేయను. సిగ్గుతో ఎరుపెక్కిన మొహాన్ని గుండెల్లో దాచుకుంది. ఆమె మాటలు విని తనూ కళ్ళు తెరిచాడు వాసు. నరసింహం గంభీరంగా "ఫరవాలేదమ్మా, ధ్యానం చేస్తున్నప్పుడు మనస్సులోకి ఏ ఆలోచనవచ్చినా పట్టించుకోకూడదని చెప్పానుగా. వాటిని అలా చూస్తూఉండు. యెంత దుర్మార్గమూ, అసభ్యమూ అయిన ఆలోచనవచ్చినా సరే, నీకు కానట్లు చూస్తూవుండు. అదేపోతుంది. మనస్సు కుదుటపడుతుంది."

* * *

మూడురోజులు రెండుపూట్లా ధ్యానం చేశారు వాళ్ళు.

కళ్ళు తెరిచి "అబ్బ! ఎంత హాయిగా ఉందీ! మనుషులు మనస్సుని స్వేచ్ఛగా ఒదలడం నామోషీ అయి తాగుడూ అవీ అలవాటు చేసుకుంటారు, అచ్చం స్కాచ్ విస్కీ తాగినట్లుంది. హాయిగా మత్తుగా." అన్నాడు వాసు. అతనికి వెయ్యేనుగుల బలం వచ్చినట్లుంది.

అతని మాటలు వినపడనట్లు లలిత అలాగే కూర్చుని వుంది. పదినిముషాలయ్యాక కళ్ళు తెరిచి ఒక్కసారిలేచి, వాసుని గాఢంగా కావలించుకుంది.

లలిత తనంతతానుగా కావలించుకుని అయిదేళ్ళు దాటిందని గుర్తొచ్చిన వాసు పరవశించిపోయాడు. అలాగే ఆమెని గాలిలోకి లేవనెత్తాడు! దూరాన నరసింహం కనపడితే "కిందికి దించండీ, ఆయనకి కనిపిస్తాం." అని మారాం చేయసాగింది. విరిసిన గులాబీలా

సిగ్గుతో ఎరుపెక్కిన ఆమె ముఖంలోకి చూస్తూ "నా దేవత నాకు దొరికింది. ధ్యానం చేసి మానససరోవరంలో మునిగితేకాని ముత్యాలు దొరకలేదు మనకి."

నరసింహం అక్కడికి వచ్చేసరికి ఛాక్‌పీసులు దొంగిలిస్తూ టీచరుకి దొరికిపోయిన నర్సరీపిల్లల్లా తలలువంచుకున్నారు ఆ దంపతులు. ఇద్దరూ పాదాలమీదవాలే ప్రమాదం జరగబోతోందని అతను పసిగట్టి వారిస్తూ "నో పాదపూజాస్ ... నాకు దణ్ణం పెడితే నన్ను చంపినంతఒట్టు. ఊఁ రండి. కాఫీలు తాగుదురుగాని' అని కన్నీరు తుడుచుకున్నాడు.

నడుస్తూ "ఏం తల్లీ. విశ్రాంతి సరిపోయిందా, ఇంక నీ మొగుడి ఆలనాపాలనా చూడొచ్చునువ్వు. ధ్యానంమాత్రం రోజూ రెండుపూటలా చేయాలిసుమా" అన్నాడు.

ఒకళ్ళనడుం ఒకళ్ళు పట్టుకుని వెనకాలే నడుస్తున్న ఆ దంపతులు మళ్లీ కొత్తగా పెళ్లయిన వాళ్లలా కనిపించారు అతనికి.

**(అభిసారిక; మాసపత్రిక – మార్చి 1978)**

★